

కథ

పి.సుభాషిణి

# వ్యామోహం

పేపర్ చదువుకుంటున్న ఆనందరావు తలెత్తి చూస్తే, రేణుక హాలంతా తదేకంగా చూడడం కనిపించింది.

"రేణూ! ఏంటలా చూస్తున్నావ్?" అడిగాడు అతడు.

ఆమె చెప్పింది- "చాలా రోజులుగా గమనిస్తున్నా...హాల్లో మరో సోఫా వుంటే బాగుంటుందేమోననిపిస్తోంది"

అతడు అప్పటికే చదివేసిన పేపర్ పక్కన పడేసాడు. "ఇప్పటికే ఇంటి నిండుగా వస్తువులు అమర్చేసావ్. ఇంకా ఓ సోఫా అవసరమా?"

రేణుక భర్తకేసి చిరాగ్గా చూసింది. "మీరెప్పుడూ ఇంతే. అద్దె ఇంట్లో వున్నంతకాలం ఇది అద్దె ఇల్లు ఎంత తక్కువ ఫర్నిచర్ వుంటే అంత మంచిదన్నారు. ఇప్పుడు సొంత ఇల్లు కట్టుకున్నాం, ఇల్లంతా వస్తువులతో నింపేస్తున్నానని గొడవపెడుతున్నారు.. వస్తు సామగ్రితో నిండుగా వున్నప్పుడే ఇల్లు అందంగా కనిపిస్తుందండీ"

ఆనందరావు పదిహేనేళ్ల క్రితం ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్ వచ్చాడు. చాలాకాలం అద్దె ఇళ్లల్లో కాపురం చేసాక ఈమధ్యనే కాసింత స్థలం కొని ఇల్లు కట్టుకున్నాడు.

చాలామందికున్నట్టే రేణుకకూ వస్తువ్యామోహం ఎక్కువ. కనిపించిన ప్రతీదీ కొని ఇంట్లో అలంకరించుకోవాలనుకుంటుంది. 'ఇంటికి అలంకరణ, వాడుకునేలా వస్తువులు అవసరమే కానీ అతిగా కొనడం కరెక్ట్ కాదనేది' ఆనందరావు అభిప్రాయం. వాళ్లిద్దరి మధ్య ఈ విషయం మీద అప్పుడప్పుడు గొడవ జరిగినా ఎక్కువసార్లు అతడే సర్దుకుపోయేవాడు.

ఇదిగో ఇప్పుడు మళ్లీ మరో సోఫా తీసుకురావాలంటోంది!

ఆనందరావు దీర్ఘంగా నిశ్వసించాడు. రేణుక మనసులో ఇలాంటి కోరిక ప్రవేశించాక, అది తీరేవరకూ ఆమె వదలదని తెలుసు. అందుకే తనే కాంప్రమైజ్ అయిపోతూ అన్నాడు "సర్లే...సంక్రాంతికి ఊరెళ్లి వచ్చాక షాపింగ్‌కెళ్దాం"

రేణుక ముఖంలో ఆనందం కదలాడింది.

"మమ్మీ..కాఫీ...!" అప్పుడే బెడ్‌రూంలో నుంచి అరుపు వినిపించింది.

"చిన్నోడు లేచినట్టున్నాడు. ఇంకా పాలు కూడా వేడి చేయలేదు. అరనిమిషం ఆలస్యమైనా వాడు అరిచేస్తాడు" మనసులో అనుకుంటున్నట్టు పైకే అంటూ వంటగది వైపు పరుగులాంటి నడకతో వెళ్లింది రేణుక.

ooo

ట్రెయిన్ దిగాక టాక్సీ మాట్లాడుకున్నారు.

పది కిలోమీటర్ల ప్రయాణం తర్వాత "మా ఊరికీ తారు రోడ్డు వేసారే" అన్నాడు ఆనందరావు.

"అవునండీ! ఇప్పుడు ప్రయాణం సుఖంగా వుంది" పలికింది రేణుక.

ముందు కూర్చుని వున్న ప్రదీప్ "లాస్ ఇయర్ మనమొచ్చినప్పుడు, రోడ్డు పక్కన చెట్లు చాలా ఎక్కువగా వుండేవి డాడీ... ఇప్పుడు కనిపించడం లేదు" వెనక్కి తిరిగి అన్నాడు.

"రోడ్డు వెడల్పు చేయడం కోసం కొట్టేసినట్టున్నారు" అభివృద్ధి పేరుతో పల్లెటూర్లు స్వచ్ఛతను కోల్పోవడం బాధాకరంగా అనిపించింది అతడికి.

మరో పది నిమిషాల ప్రయాణం తర్వాత కారు పావు ఎకరం మధ్యనున్న జమీందారి కోట లాంటి ఇంటి ముందు ఆగింది.

కారు శబ్దం వినగానే డెబ్బయ్ ఏళ్ల ముసలావిడ మెల్లగా నడుచుకుంటూ వీధి గుమ్మం వరకూ వచ్చింది.

ఆనందరావు కారు డిక్కీలో నుంచి లగేజీ దించుతున్నాడు. అలికిడికి తల తిప్పిన అతడు ఆవిడను చూడగానే "అమ్మా! బాగున్నావా?" అడిగాడు. అప్పటికే ఆఖరి సూట్‌కేస్ దించేయడంతో ఆమె దగ్గరగా వెళ్లి భుజం చుట్టూ చేతులేసాడు.

"రండర్రా" అందామె లోపలికి నడుస్తూ.

ఇద్దరు పిల్లలు, రేణుక లగేజీ చేత పట్టుకుని వెనుక నడుస్తుంటే, అతడు తల్లితో కలసి లోపలికి అడుగులేసాడు.

ఆ ఇంట సందడి మొదలైంది.

ooo

మధ్యాహ్నం వరకూ వందనమ్మ లేని ఓపిక తెచ్చుకుని పనిచేసినా భోజనాల తర్వాత నడుం వాల్చింది.

ఆవిడ అలా పడుకున్న అరగంటలోనే "బామ్మా! ఓ బామ్మా!" అంటూ పిలుపు వినిపించడంతో విసుగ్గా నిద్రలేచి ఇంటి వాకిట్లోకి వెళ్లింది.

అత్తగారు విసుక్కుంటూ వెళ్లడం రేణుక గమనిస్తూనే వుంది. అక్కడి సంభాషణ కూడా వినిపిస్తోందామెకు.

"ఏంటే ప్రమీలా?"

"బామ్మా! రేపు వరికోత వుందే. కాసింత పెద్ద బిందె కావాలి"

"అవన్నీ అటక మీదున్నాయి. ఎవర్నయినా పంపించు, దింపుకుని తీసుకెళ్లు. తిరిగి నువ్వే వాళ్ల చేత అటక మీద పెట్టించాలి"

"అలాగే"

పక్కింటావిడ వెళ్లిపోయింది.

"ఏంటో ఈ గొడవ! లంకంత కొంపలో ఈ

నాలుగు బళ్ల సామాను సర్దుకోలేక కాపాడలేక చచ్చిపోతున్నాననుకో" వందనమ్మ కోడలి పక్కనే వచ్చి కూర్చుంటూ పలికింది.

ఎప్పుడా పల్లెకు వచ్చినా అత్తగారి ఇబ్బంది గమనిస్తూనే వుంది రేణుక.

అది లంకంత కొంప. ఆ ఇంటిని చిమ్మి, కడగాలంటే గంట సమయం పడుతుంది. ఇక ఇంట్లోని వస్తువులు చూస్తే, సిటీలో పది చిన్న సంసారాలకు సరిపోయేలా వుంటాయి. బండెడు వంటపాత్రలు రెండు లారీలకు సరిపడే మంచాలు, కుర్చీలు, పరుపులు, దిండ్లు... ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంత లిస్టు వుంటుంది. అంత సామానుని సర్దుకోవడమన్నా, అప్పుడప్పుడు శుభ్రం చేయడమన్నా చాలా కష్టం.


"కొన్ని అమ్మేయడమో ఎవరికైనా ఇచ్చేయడమో చేస్తే సరిపోతుంది కదా"

వందనమ్మ కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా వుంది. "నిజమే ఇన్ని వస్తువుల్ని శుభ్రంగా వుంచలేక, కాపాడలేక విసిగిపోతున్నాను. దేవుడి దగ్గర కాసింత సమయం గడపాలనుకుంటాను. కానీ వస్తువులను సర్దుకోవడంలోనే ఎక్కువ సమయం గడిచిపోతుంది. అలాంటప్పుడు ఈ వస్తుసామగ్రిని వదిలించుకోవాలనిపిస్తుంది. మిమ్మల్ని హైదరాబాద్ తీసుకెళ్లమంటే మీరేమో ఓల్డ్ ఫర్నిచర్, పనికిరాని వంట పాత్రలంటూ పట్టించుకోవడం లేదు. మీరన్నదీ నిజమే! కుక్కర్లొచ్చాక రాగిపాత్రలతో అవసమేముంటుందీ? ఫిల్టర్ వాడుతుంటే కంచుబిందెలతో పనేముంటుందీ? కాలానికి అనుగుణంగా ఇంటికి అవసరపడే వస్తుసామగ్రిలోనూ మార్పు వస్తుందని తెలుసుకున్నాక మిమ్మల్ని వత్తిడి చేయలేదు. అలాగే ఎంతో ఇష్టపడి, కష్టపడి కొనుక్కున్న వస్తువుల్ని అలా ఎవరికీ ఉచితంగా ఇచ్చేయలేకపోతున్నాను"

రేణుక మనసుకు ఏదో తోస్తోంది. తను కూడా ఈ మధ్య వస్తుసేకరణ ఎక్కువగానే చేస్తోంది. వయసులో వున్నప్పుడు ఆ వస్తువుల్ని చూసి మురిసిపోతాం. వాటి కోసం ఎంతో సమయం వెచ్చించి అందంగా అమర్చుకుని సంబరపడిపోతాం. కానీ ఓ తరం కొన్న వస్తువుల్ని మరో తరం అంతగా ఇష్టపడదు. అందులోనూ నేటి తరం ఎప్పుడు ఎక్కడ వుంటారో? అప్పుడు ఒక తరం కొన్న వస్తువులు మూలన పడతాయి. మూలపడిన తమ శ్రమ చూసుకుంటే సంపాదించుకున్న వాళ్లకు గుండె తరుక్కుపోతుంది... ఇది నిజం.

ooo

సిటీకి చేరిన వారం రోజుల తర్వాత కూడా రేణుక సోఫా



గురించి ప్రస్తావించకపోవడంతో ఆనందరావు అడిగాడు-

"సోఫా అంటూ గొడవ చేసేదానివి. ఆ విషయమే ప్రస్తావించడం లేదేమిటి?"

"ఇంటి నిండా అందంగా సామాను సర్దుకోవడం ఆనందమే! కానీ వయసొచ్చాక, పిల్లలు దూర తీరాలకు వెళ్తే ఆ వస్తువులు సర్దుకోలేక వృద్ధులుపడే శ్రమ కూడా తెలిసొచ్చింది...అందుకే నాలో వస్తువ్యామోహం నశించింది"

వస్తువ్యామోహం వార్ధక్యంలో భరించలేని కష్టమైతే వయసున్నప్పుడు భరించగలిగే అనవసర శ్రమ. ఎప్పుడైనా వస్తుసామగ్రి మితంగా వుంటేనే మనం సుఖంగా వుంటాం.

o